తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## స్పందనకు 369 అర్జీలు

చిత్తూరు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్ అధ్యక్షతన ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 369 అర్జీలు అధికారులకు అందాయి. కలెక్టరేట్‌లో సోమవారం జగిన స్పందన కార్యక్రమంలో డిఆర్‌ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించిన డిఆర్‌ఓ రాజశేఖర్ సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త



స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్‌డిసిలు లీగల్ సెల్ శ్రీనివాసరావు, ఏపిఐఐసి శ్రీనివాసులు, ప్రోటోకాల్ భాస్కర్ నాయుడుతో కలిసి స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు కలెక్టరేట్ ఎఓ జయరాములు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్పందన ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. మొత్తం 162 వినతులు అందాయి.

## వైభవంగా శ్రీవారి రథోత్సవం



తిరుమల, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త ప్రతినిధి :
తిరుమల శ్రీ వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం 6.55 నుండి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్ప స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి రథాన్ని లాగారు బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయదేవేరులతో మలయప్ప స్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీధులలో విహరింపజేసారు. శ్రీవారిని భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణతో ఆలయ మాడవీధులు మారుమోగాయి. అనాదికాలం నుండి రాజులకు రథసంచారం ప్రసిద్ధం. యుద్ధాలలో కూడా విరివిగా రథసంచారం జరిగినట్లు భారతాది గ్రంథాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడు. రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే అన్న ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, తిరుమల చిన్నజీయర్ స్వామి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఈవో ఎవి. ధర్మారెడ్డి దంపతులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, డిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పలువురు బోర్డు సభ్యులు , జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



### చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి

తిరుమల, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త ప్రతినిధి :
శ్రీ వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సెప్టెంబర్ 26న చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 6 నుండి 9 గంటల వరకు శ్రీ వరాహస్వామి వారి ఆలయం వద్ద గల స్వామి పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారికి శ్రీ చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం ఆ తరువాత చక్రస్నానం నిర్వహిస్తారు. ఇందుకోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరిణిలో గ్యాలరీలు, స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు.

## అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీమలయప్ప



తిరుమల, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త
కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన సోమవారం రాత్రి అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీ మలయప్పస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవ జరిగింది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనాలు, కోలాటాలు, జీయ్యంగార్లు వేదమంత్రాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం 6 నుండి 9 గంటల వరకు స్వామి పుష్కరిణిలో స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు ధ్వజారోహణం జరుగనుంది.

ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఈవో ఏవి ధర్మారెడ్డి దంపతులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం సివిఎస్వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 4 నుంచి మూడు రాష్ట్రాల్లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం

శ్రీహరికోట (తడ), సెప్టెంబర్ 25 ప్రభాతవార్త
శ్రీహరికోటలోని సతీష్ థవన్ అంతరిక్ష కేంద్రం ఆధ్వర్యంలో అక్టోబర్ 4 నుంచి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ తెలిపారు. ఈ సారి మూడు రాష్ట్రాలలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వాక్ ఫర్ స్పేస్ వీక్ పేరిట పలుచోట్ల ఇస్రో శాస్త్రవేత్తలు ప్రసంగించి విద్యార్థులతో పాటు సామాన్యులలోనూ అంతరిక్ష కార్యక్రమాల గురించి వివరిస్తారని తెలిపారు. శ్రీహరికోటలో ఈ నెల 4న ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు 10న ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం విశాఖపట్నం, రాజమండ్రి, కర్నూలుతో పాటు తమిళనాడులోని తిరుచిరపల్లి, విల్లుపురం, కోయంబత్తూర్, ఒరిస్సాలోని పూరిలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీలోని తిరుపతి, సంగం, చింతవరం, వరదయ్యపాలెంలలో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏటాలాగే ఈ ఏడు కూడా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కుప్పం వైఎస్సార్సీలో మళ్లీ భగ్గుమన్న వర్గపోరు

**-కుప్పం మున్సిపాలిటీ కార్యాలయంకు తాళాలు వేసిన అధికారపార్టీ కౌన్సిలర్లు**
**- జత కలసిన పలువురు దేశం కౌన్సిలర్లు.. ఉద్యోగులను బయటకు పంపిన వైనం**





కుప్పం మున్సిపాలిటీ కార్యాలయంకు తాళాలు వేసిన దృశ్యం, .వైఎస్సార్సీ కౌన్సిలర్లతో మాట్లాడుతున్న అర్బన్ సి.ఐ. శ్రీధర్

కుప్పం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త
సాధారణంగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వాగ్వివాదాలో, అభివృద్ధి జరగలేదనే చర్చ చోటుచేసుకుంటే ప్రతిపక్ష పార్టీల నేతలు నిరసనలు తెలిపేవిషయం విదితమే. అయితే కుప్పం మున్సిపాలిటీ పరిధిలో అధికార వైఎస్సార్సీ కౌన్సిలర్లు అభివృద్ధి జరగడం లేదని మున్సిపల్ కార్యాలయంకు తాళాలు వేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈసంఘటన చర్చనీయాంశంగా మారింది. మొన్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శాంతిపురం మండలంలో అధికార పార్టీ నేతల నుంచి నిరసన సెగ తగలగా తాజాగా నేడు అధికార పార్టీ కౌన్సిలర్లే మున్సిపల్ కార్యాలయంకు తాళాలు వేయడం గమనార్హం. వీరిలో కొందరు కౌన్సిలర్ల భర్తలు, కొందరు కౌన్సిలర్లు ఉండడం విశేషం. కుప్పం మున్సిపల్ ఉద్యోగులు సోమవారం యధావిధిగా మున్సిపల్ కార్యాలయంకు చేరుకున్నారు. అనంతరం కొంతసేపటికి అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు సయ్యద్ అలీ, ఎంఆర్ సురేష్, మణి, జగన్, రవి, రాజ్‌కుమార్ తదితరులు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. మున్సిపల్ పరిధిలో పనులు ఏమీ జరగడం లేదని ప్రజలకు తాము సమాధానం చెప్పలేకపోతున్నామని పలువురు అధికార కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఏదైనా మాట్లాడాలంటే కమీషనర్ ఉండడం లేదని పేర్కొన్నారు. ఐదు రోజుల క్రితం మున్సిపాలిటీలో తమకు తెలియకుండా కొత్తగా పలువురిని ఉద్యోగాల్లో నియమించుకున్నారని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు సైతం నిర్వహించడం లేదని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయం లోపల విధుల్లో ఉన్న ఉద్యోగులను బయటకు రప్పించి తాళాలు వేశారు. అనంతరం పలువురు తెదేపా కౌన్సిలర్లు కూడా అక్కడకు చేరుకున్నారు.

**చట్టాన్ని చేతుల్లో తీసుకోవద్దు - అర్బన్ సిఐ శ్రీధర్**

మున్సిపల్ కౌన్సిలర్లు ఏదైనా సమస్యలు ఉంటే కూర్చుని చర్చిం చుకోవాలే తప్ప మున్సిపల్ కార్యాలయంకు తాళాలు వేసి చట్టాన్ని చేతుల్లో తీసుకుంటే ఊరుకోమని అర్బన్ సిఐ శ్రీధర్ హెచ్చరించారు. అసలు ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను బయటకు రప్పించి తాళాలు వేస్తే కేసులు నమోదవుతాయని పేర్కొన్నారు. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలే గానీ ఇలా వ్యవహరించడం పద్ధతి కాదని కౌన్సిలర్లకు సూచించారు.

**వర్గాలుగా విడిపోయిన కౌన్సిలర్లు :**

కుప్పం మున్సిపాలిటీకి 2011నవంబర్‌లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 25వార్డులకు ఎన్నికలు జరగ్గా వాటిలో 19వార్డులను అధికార వైఎస్సార్సీ కౌన్సిలర్లు గెలుచుకోగా 6వార్డులను తెదేపా కౌన్సిలర్లు గెలుచుకున్నవిషయం విదితమే. అయితే అధికార పార్టీకి చెందిన 19 మంది కౌన్సిలర్లలో మున్సిపల్ ఛైర్మన్, ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉండగా 16మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో కౌన్సిలర్లు వర్గాలుగా విడిపోయి ఆధిపత్య పోరు కొనసాగిస్తున్నారు.

## చినుకు పడితే కునుకు కరవే...!

### -ఆందోళనలో ఆమినిగుంట వాసులు





ఇంట్లో నుంచి నీటిని తోడుతున్న మహిళ, ఇళ్ళల్లోకి వస్తున్న మొరవ నీరు

చౌడేపల్లి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త
కొద్దిపాటి వర్షం కురిస్తేనే ఆ గ్రామానికి నిద్ర లేని పరిస్థితి...ముసలి ముతక పిల్ల జల్లా అందరూ బయటకొచ్చి జాగారణ చేయాల్సిందే...మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమినిగుంట నాగార్జున కాలనీలో ఈ దుస్థితి ఏర్పడుతోంది. గ్రామానికి సమీపంలో నాగులకుంట వుంది. అడపా దడపా వర్షం కురిస్తే వెంటనే చెరువు నిండుతుంది. గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా కొద్దిపాటి వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నాగులకుంట నిండి మొరవ పోయింది. రాత్రి 12గంటల దాటాక మొరవ నీరు ఆమినిగుంట నాగార్జున కాలనీపై పడ్డాయి. దీంతో 50కుటుంబాలున్న కాలనీవాసులు ఉలిక్కిపడి లేచారు. ఇళ్ళల్లోకి నీరు రావడంతో చంటిబిడ్డలు, వృద్ధులు, ప్రజలు ఇళ్ళ నుంచి పరుగులు తీశారు. ఊరి బయటకొచ్చి రాత్రంతా జాగారణ వున్నామని కాలనీ వాసులు వాపోయారు. వర్షం కురిసిన ప్రతి సారీ ఇదే పరిస్థితి నెలకొన్నదనీ, చెరువులోంచి వస్తున్న మొరవకు కొందరు అడ్డుకట్ట వేయడంతో నీరు గ్రామం మీద పడుతున్నాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాగులకుంట నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

## శ్రీ-కాళ-హస్తిలకు శాస్త్రోక్తంగా పవిత్ర పూజలు

### భక్తులకు దర్శనమిచ్చిన భరద్వాజ మహర్షి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో భరద్వాజ మహర్షి ఉత్సవాన్ని చక్కగా అలంకరించారు. ఆయనతో పాటు శ్రీ-కాళ-హస్తి ఉత్సవ విగ్రహాలను కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు అలంకార గురుకుల్ అలంకరించారు. మొదటి పూజలు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చే సంకల్పం చేయించారు. ఆలయాధికారులు, ధర్మకర్తల మండలి చైర్మెన్, శాసనసభ్యుని కుటుంబసభ్యులు హాజరు కాగా ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామి నాథన్ శాస్త్రోక్తంగా స్థానిక ఆచార వ్యవహారాల మేరకు హోమాలు, పూజలు నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా అభిషేక గురుకుల్ స్వామినాథన్ పూజలు అభిషేకాలు జరిపారు.

**భరద్వాజమహర్షి గ్రామోత్సవం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలను ప్రతి ఏడాది నిర్వహించటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సోమవారం నుంచి పవిత్రోత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉదయం గ్రామోత్సవం జరిపారు. తరువాత బోయిలు మోసుకుంటూ ఉత్సవర్లను పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్యకులైన ఎస్ఎంకె బాబూ గురుకుల్ ఇంటి వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. హారతులిచ్చారు. ఊరేగింపు నాలుగు మాడావీధుల్లో సాగింది. పవిత్రోత్సవాల కార్యక్రమాలను ఆలయ అనువంశిక ఆలయ ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామి నాథన్ సారథ్యంలో పౌరోహితులు అర్ధగిరి స్వామి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, అర్చకులు శ్రీనివాస గురుకుల్, తేజస్వామి, గోవింద్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, ఎసి మల్లికార్జున ప్రసాద్, ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఎఇఓ ధనపాల్ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సతీమణి బియ్యపు వాణి, తనయ బియ్యపు పవిత్రారెడ్డి ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు, ఎంపి శ్రీలక్ష్మి, కొండూరు సునీత తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం గణనాధుని రథోత్సవం

### కిక్కిరిసిన భక్తజన సందోహం



కాణిపాకం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈకార్యక్రమానికి కీ'॥శే॥ శ్రీ కె.యతిరాజులు నాయుడు, కాకర్లవారిపల్లె వారి జ్ఞాపకార్థం వారి కుమార్తె శ్రీమతి మీనాకుమారి, కీ॥శే॥ యన్.శివప్రసాద్ నాయుడు దంపతులు, శ్రీ కె. పూర్ణచంద్రారెడ్డి, మాజీ వి.ఎం.కాణిపాకం, కీ॥శే॥ శ్రీ కె.చంద్రశేఖరరెడ్డి, మాజీ వి.ఎం. వారి జ్ఞాపకార్థం వారి కుమారులు కె.హరిప్రసాద్‌రెడ్డి, కాణిపాకంలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉదయం దేవస్థానం వారిచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి చందనాలంకారం చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయం నుండి తీసుకువచ్చి శోభాయమానంగా అలంకరించిన స్వామివారు ఊరేగే రథంపై అధిరోహింపజేశారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లకు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకస్వాములు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన అశేష భక్తజనం గణేష్ నామస్మరణల నడుమ ఉదయం రథంను కొంత దూరం లాగి వదిలిపెట్టారు. ఈసందర్భంగా భక్తులు రథంపై భక్తులు బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులను తీర్చుకున్నారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, రంగస్వామి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, సురేష్, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

**ఉచిత ప్రసాదాల పంపిణి**

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం జరిగిన రథోత్సవం సందర్భంగా పలువురు దాతలు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రతి ఏటా రథోత్సవం రోజున పలువురు దాతలు భక్తులకు ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేస్తుంటారు. ఈమేరకు సోమవారం ఆలయం వద్ద పలువురు దాతలు భక్తులకు ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాల ప్రసాదాలను, మజ్జిగ, నీటి ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. దీనితో పాటు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన భవన్ వద్ద ప్రత్యేకంగా అన్నప్రసాద వితరణ చేశారు.

## 'దేశం' వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో నిరసన

**చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:**



మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ సోమవారం తెలుగుదేశం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో జిల్లా తెలుగుదేశం వాణిజ్య విభాగం అధ్యక్షుడు హిమగిరి, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు నీరజాక్షుల నాయుడు, నియోజకవర్గ అధ్యక్షుడు గుణశేఖర్‌నాయుడు, చిత్తూరు మండలం వాణిజ్య విభాగం అధ్యక్షుడు గిరినాయుడులు ఈ దీక్షలో పాల్గొన్నారు. దీక్షలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర పార్టీ క్యాదర్శి వెంకిటీల సురేంద్రకుమార్, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలజీ, జిల్లా దేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, చిత్తూరు రూరల్ మండల దేశం అధ్యక్షుడు శశికర్‌బాబు తదితులు పాల్గొని మద్దతు తెలిపారు.

## రాష్ట్ర మొదలియార్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు మాతృవియోగం

- నివాళి అర్పించిన వైసిపి నాయకులు నూకతోటి రాజేష్

**వెదురుకుప్పం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త :**



రాష్ట్ర మొదలియార్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ జడ్పీటీసీ గుణశేఖర్ తల్లి సంపూర్ణమ్మ అనారోగ్యంతో మృతి చెందిన సమాచారం తెలిసి గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైసిపి నాయకులు నూకతోటి రాజేష్ తూగుండ్రం చేరుకుని మృత దేహంకు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. గుణశేఖర్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు నాయకులు వెల్కం కుట్టి, లోకనాథం, మురళి, జానకిరామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపకరణాలు సద్వినియాగం చేసుకోవాలి

జిల్లా సహిత విద్యా సమన్వకర్త ప్రభాకర్ వర్మ



**గంగాధర నెల్లూరు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త :** దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్యా సమన్వకర్త ప్రభాకర్ వర్మ తెలిపారు. మండల కేంద్రంలోని భవిత సెంటర్ నందు సోమవారం మండల విద్యాశాఖాధికారులు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డిల అధ్యక్షతన వైద్య నిర్ధారణ పరీక్షల అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందజేయడం కొరకు ప్రతి ఏటా వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు అందరితో పాటు విద్యా అభ్యాసించి అభివృద్ధి చెందాలని ప్రభుత్వం వారికి ఉచితంగా పరికరాలు అందజేస్తున్నదని చెప్పారు. అనంతరం డాక్టర్లు వైద్య నిర్ధారణ పరీక్షలు చేశారు. శిబిరంకు వివిధ ఉపకరణాల కోసం 44 మంది దివ్యాంగులు హాజరుకావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ శిల్పా, సహిత ఉపాధ్యాయులు లావణ్య, పుష్పావతి, ప్రధానోపాధ్యాయులు గంగాధరం, ఫిజియోతెరపిస్టు నిరంజన్ రెడ్డి, యంఐస్ కోఆర్డినేటర్ ప్రసాద్, సిఆర్‌పీలుకుమారి,జయకోడి,దేవేంద్రరెడ్డి, గుణశేఖర్, దివ్యాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి నిలయాన్ని వదలని దొంగలు

పాఠశాలలో పైపులు చోరీ , వేలాది రూపాయిలు సొంత వ్యయం భరిస్తున్న ఉపాధ్యాయులపై పెనుభారం

**వరదయ్యపాలెం, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త**



వేలాది మంది పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే దేవాలయం లాంటి సరస్వతి నిలయాన్ని కూడా దొంగతనానికి దిగజారుతున్న నీచమైన దొంగలని ఉపాధ్యాయులు వాపోతున్నారు. వరదయ్యపాలెం జడ్పి ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇప్పటికీ ఇదే పాఠశాలలో చోరీ జరగడం గత ఏడాదిన్నర కాలంలో ఇది మూడవ సారి కావడం గమనార్హం. పాఠశాలలో విద్యార్థుల విద్యా వసతి కోసం ఏర్పాటు చేసిన తాగునీటి పైపులు కరెంట్ తీగలు చోరీ చేశారు. ఇలా చోరీ జరిగిన ప్రతి సారీ ఉపాధ్యాయులు తమ సొంత వ్యయం ఖర్చు పెట్టి వేలాది రూపాయిలను భరించాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ చోరీల విషయమై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం పై ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. చోరీలపై విచారణ చేసి దొంగతనాలను అరికట్టి పాఠశాల ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి - డిఆర్‌డిఎ పిడి తులసి

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**

స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం చెందాలని డిఆర్‌డిఎ పిడి తులసి సూచించారు. సోమవారం విజన్ బిల్డింగ్ కార్యక్రమంకు సభ్యులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలు చిన్న రుణాలకే పరిమితమవుతున్నారని నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు జీవనోపాధి పెంపుకు ప్రవేశపెట్టాయన్నారు. ఈ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం చెందవచ్చన్నారు. ఇందుకు సభ్యులు ప్రణాళికలు రూపొందించుకుని అనుకున్న లక్ష్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పిలు వెంకటేష్ విజన్ బిల్డింగ్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసి సభ్యులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

## బావిలో గల్లంతైన వ్యక్తి మృతి



**కుప్పంరూరల్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**

మండలంలోని నూలుకుంట గ్రామంలో వినాయక విగ్రహాల నిమజ్జనంకు వెళ్లి బావిలో గల్లంతైన వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం రాత్రి గ్రామస్తులు అతికష్టం మీద బావిలో పడ్డ శ్యామమూర్తి (42) ఆచూకీని గుర్తించారు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. సోమవారం శ్యామమూర్తి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కుప్పంలో కొనసాగుతున్న తెదేపా దీక్షలు.. మద్దతు పలికిన అంగన్‌వాడీలు!!

**కుప్పం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టను ఖండిస్తూ కుప్పంలో తెలుగుదేశం శ్రేణులు చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగాయి. సోమవారం చంద్రబాబు అరెస్టను ఖండిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తాము అధికార పార్టీ నేతలు చెప్పినట్లు వినకపోవడంతో తమపై తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్నారని పేర్కొన్నారు. కప్పలనత్తంకు చెందిన కవిత అనే అంగన్‌వాడీ కార్యకర్త తాను అధికార పార్టీకి అనుకూలంగా లేదని సిడిపిఒతో చెప్పడంతో ఆమె తనను సెలవులో వెళ్లాలని ఇబ్బంది పెడుతున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలుగా వైకాపా కార్యకర్తలే పనిచేయాలా అని ప్రశ్నించింది. ఈ కార్యక్రమాల్లో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేత గోపీనాథ్,మాజీఎంపిపిలుడా॥వెంకటేష్,ఆంజనేయరెడ్డి,నేతలు మునస్వామి, కామరాజనాయక్‌పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనం

**శాంతిపురం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**



మండలంలో వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టించిన పలు విగ్రహాలను సోమవారం ఘనంగా నిమజ్జనం చేశారు. రాళ్లబూదుగూరులో వినాయక యూత్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం లడ్డూ వేలం పాటను నిర్వహించగా గ్రామానికి చెందిన ప్రేమ ముప్పై తొమ్మిదివేలకు దక్కించుకున్నారు. స్వామివారి నాణెంను మహేష్‌బాబు పదివేలకు దక్కించుకున్నారు. అనంతరం స్వామివారిని బాణసంచా హోరు మధ్య స్థానిక కోనేరులో నిమజ్జనం చేశారు. యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చేతివృత్తుల ద్వారా మహిళలు అర్థికంగా ముందడుగు

**పాలసముద్రం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:**



చేతివృత్తుల ద్వారా మహిళలు ఆర్థికంగా ముందడుగు వేయాలని రూరల్ యాక్షన్ సంస్థ కార్యదర్శి చిట్టిబాబు పేర్కొన్నారు. వెంగళరాజకుప్పం వీర్లగుడి ఆది ఆంధ్రవాడలో కోయార్ బోర్డు వారి ఆధ్వర్యంలో మహిళలకు రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో స్పిన్నింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చిట్టిబాబు మాట్లాడుతూ శిక్షణ పొందన మహిళలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తోందని ఈ మొత్తంతో వ్యాపారాభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ సత్యవతి, సిందుర్ సంస్థ నుండి రవి, క్రాస్ సంస్థ నిర్వాహకులు భూపతి, రిటైర్డ్ స్కూల్ టీచర్ ఆర్ముగం, ట్రైనర్లు లిల్లీ, రేఖ, భార్గవి, జ్యోతి, గ్రామస్తులు జె.బాబు తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా వినాయకుడి నిమజ్జనం



**చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** వినాయక చవితి పురస్కరించుకొని చిత్తూరు డిఐ రోడ్డులో ప్రతిష్టించిన భారీ వినాయకుడి విగ్రహంను సోమవారం నిమజ్జనం చేశారు. చిత్తూరు డిఐ రోడ్డు నుండి భారీ ఊరేగింపుతో బయలుదేరి చిత్తూరు ప్రధాన వీధుల నుండి కట్టమంచి చెరువు వరకు తీసుకెళ్లారు. అక్కడ మున్సిపల్ సిబ్బంది ట్రాక్టర్ నుండి వినాయక విగ్రహంను క్రేన్‌ల ద్వారా తీసి చెరువులో నిమజ్జనం చేశారు.

## స్పందన విజయవంతంకు అధికారులకు చూచనలు

**వెదురుకుప్పం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త :**

స్పందన విజయవంతంకు ఎంపిడివో సుధాకర్‌రావు అధికారులకు సోమవారం చూచనలు ఇచ్చారు. మండల అభివృద్ధి కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఎంపిడివో కార్యాలయం ఆవరణంలో జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ, సచివాలయ స్థాయిలో సమస్యల పరిష్కరంకు ప్రజలు అధికారుల దృష్టికి వినతి పత్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు.మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నియోజకవర్గం కోసం పెద్దిరెడ్డి కుటుంబం అంకితం

-ఎంపి ఎన్.రెడ్డెప్ప



**పుంగనూరు,సెప్టెంబర్ 25 ప్రభాతవార్త :**

దశాబ్దాల పాటూ నిర్లక్ష్యానికి గురైన పుంగనూరు అభివృద్ధికి మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం అంకితమై సేవలందిస్తోందని ఎంపి రెడ్డెప్ప అన్నారు. సోమవారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రవాణాశాఖ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలో ఆర్టీవో కార్యాలయానికి స్వంత భవనంనిర్మించేందుకు గానూ ప్రభుత్వం సేకరించిన రూ.5కోట్ల విలువైన భూమి పత్రాలను ఆయన ఆర్టీవో ఆర్.సుమిత్రకు అందచేశారు. ఎంపి మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గం గత పాలకుల చేతిలో మోసపోయిందని, ఆదుకునేందుకు వచ్చిన పెద్దిరెడ్డిని గత సిఎంలు చంద్రబాబు,కిరణ్‌కుమార్‌లు తీవ్ర ఇబ్బంది పెట్టారన్నారు. అయినా, వెనుకడుగు వేయక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన స్వంత నిధులతో పట్టణానికి కొన్నేళ్ళపాటూ తాగునీరందించిన విషయాన్ని గుర్తుచేశారు. కొండవీటి నాగభూషణం మాట్లాడుతూ పట్టణానికి ఇప్పటికే బైపాస్,మినీ బైపాస్,ఆర్టీసిడిపో,ఆర్టీవో కార్యాలయం వంటి సదుపాయాలు కల్పించారని,ఏరియావైద్యశాల వచ్చే ఏడాది అందుబాటులోనికి వస్తుందన్నారు. పిఎంకె ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్ మాట్లాడుతూ పట్టణంలో మినీ బైపాస్ వద్దనుంచి ముళబాగిల్,రామసముద్రం రోడ్లను కలిపే ఫ్లైవోర్ బ్రిడ్జినిర్మాణానికి మంత్రిని కోరుతామన్నారు. కార్యక్రమంలో మంత్రి పిఏ చంద్రహాస్,ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డి,తహసీల్దార్ సీతారాం,వైకాపా యూత్ ఐకాన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైలులో కరపత్రాలు పంచిన తెదేపా నేతలు

**కుప్పం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**



తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం కుప్పంలో తెలుగుదేశం పార్టీ నేతలు కుప్పం - బెంగళూరు మధ్య తిరిగే పుష్‌పుల్ రైలులో కరపత్రాలు పంచి చంద్రబాబుకు మద్దతు కోరారు. మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్వర్యంలో దేశం నేతలు రైల్వే స్టేషన్‌కు ఉదయాన్నే చేరుకుని స్కిల్ డెవలప్‌మెంట్‌లో జరిగిన మంచిని ప్రస్తావిస్తూ చంద్రబాబును అన్యాయంగా అరెస్ట్ చేశారని ప్రజలకు వివరించారు. ప్రజలు చంద్రబాబుకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, కౌన్సిలర్లు వేలు, జిమ్‌దాము, జాకీర్, నేతలు వెంకటేష్, డికెపల్లి మణి, శరవణ, రాజేష్, నరేష్, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**



తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం బైపాస్ రోడ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఛలో విజయవాడకు బయలుదేరితే ప్రభుత్వం పోలీసులచేత తమను అడ్డుకోవడం దారుణమన్నారు. కనీసవేతనాలు చెల్లించాలని, పాత బిల్లులు వెంటనే చెల్లించాలని, కార్యకర్తలు, ఆయాలపై అధికారపార్టీ నేతలు, అధికారుల ఒత్తిళ్లు తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ సమస్యలపై ఐసిడిఎస్ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు ప్రమీల, పలువురు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ జన్మదినోత్సవం

**పాలసముద్రం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:**



ప్రధాని నరేంద్రమోడి జన్మదినంను పురస్కరించుకొని పాలసముద్రంలో సోమవారం బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జగర్లమూడి చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రధాని మోడీ, దీనదయాళ్ ఉపాధ్యాయ జన్మదినాలను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూల మాల వేసి నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు రాజేష్, మాజీ అధ్యక్షుడు బొమ్మరాజు, బాలయ్య, మాజీ మండల మహిళా మోర్చా నాయకురాలు కుప్పమ్మ, నాయకులు పద్మ, మురగదాసు, రామరాజు, శ్రీనివాసులు, సంజీవి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైసీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



**బాలాయపల్లి, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:**

2024లో జరగబోవు ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో బాలాయపల్లి మండలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెలలో ఎన్నికలు ఉండవచ్చునని సూచనప్రాయంగా తెలిపారు. ఎన్నికలకు అందరూ సమాయత్తం కావాలన్నారు. మండలంలో త్వరలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో వైసీపీ భారీ మెజారిటీతో గెలవాల న్నారు. ఈ సమావేశంలోఎంపీపీ గూడూరు భాస్కరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, మాజీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, గోపికృష్ణారెడ్డి, దేవిక చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడక్కుండానే వరాల జల్లు కురిపిస్తున్న సీఎం జగన్

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**బాలాయపల్లి, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:**

సీఎం జగన్మోహన్‌రెడ్డి అడక్కుండానే వరాల జల్లు కురిపిస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డక్కిలి మండలంలోని వెలికల్లు, వీకేపై సముద్రం గ్రామాలలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త అయిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి గ్రామస్థులు బ్రహ్మరథం పట్టి ఘనస్వాగతం పలికారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా అంటే ప్రతి గడపలో ఆప్యాయంగా పలకరించారు. ఆయన వెంట ఎంపీపీ రాజశేఖర్, చింతల శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఉన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయం ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటా

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరి, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:**



పట్టణంలోని బంగారుపేటలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిర 600 ఎకరాలు అన్యాక్రాంతమై ఉన్నాయని, ఈ భూములను స్వామివారికి చెందినదని స్థానికులు తిరుపతి వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలోని బంగారుపేటలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అన్యాక్రాంతమైన భూముల విషయం తెలిపారు. స్మశానానికి పోయే దారిని కూడా ఆక్రమించారని, పరిష్కరించాలని కోరారు. ఆలయ భూములను సర్వే చేయించి స్వామి వారికి చెందేలా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే స్మశానికి దారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాగా నారాయణరావు అనే వ్యక్తి తనకు ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావడంలేదని తన దృష్టికి తీసుకొచ్చారని ఆయనకు పట్టణంలో గృహాలు ఉన్నందు వలన రాలేదన్నారు. అయితే నారాయణ రావుకు ప్రభుత్వం తరపున మరేమైనా ఇప్పించేందుకు తన వంతు సహాయం చేస్తానన్నారు. ఆయన వెంట కమిషనర్ వెంకటరామయ్య, వైసీపీ జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వైసీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, సీనియర్ వైసీపీ నేత లక్కమనేని కోటేశ్వరరావు, కౌన్సిలర్లు సుబ్బారావు, కళ్యాణి, గోపాలకృష్ణ, వహీదా, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వలికల కృష్ణయ్య, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 270 రేషన్ బస్తాలు పట్టివేత

**కోట, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**



కోట క్రాస్‌రోడ్డులోని హరిహర రైస్‌మిల్లులు సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 270 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ రేషన్ బియ్యాన్ని వాకాడులోని పౌరసరఫరాల శాఖ గోడౌన్‌కు తరలించారు. ఇటీవల కాలంలో కూడా విజిలెన్స్ అధికారులు దాడులు చేసి సూళ్లూరుపేట ప్రాంతం నుంచి వచ్చిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ దాడుల్లో డిఎస్పీ మల్లేశ్వరరెడ్డి, సిఐ చంద్రశేఖర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయకుమార్, పిఎస్ డిటి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ క్రాంతి పదం ఏపిఎం డాక్టర్ ఎం. చంద్రబాబు

**వాకాడు, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త**



వైఎస్ఆర్ కాంత్రి పదం కొత్తగా ఏపిఎం డాక్టర్ ఎం చంద్రబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతి నుండి వాకాడు ఏపీఎంగా, గూడూరు ఏరియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నార న్నారు. వాకాడు ఏపిఎంగా గతంలో పని చేసిన వెంకట్రావు విధులు చేసుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. కొత్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎం చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్ఆర్ క్రాంతి పదం కార్యాలయంలో పనిచేస్తున్న సిసిలు ఫేస్ అటెండెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మండలంలోని సంఘ బంధాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిసిలు వెంకట సుబ్బయ్య, నరసింహులు, భూ దేవి, మాధవి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## చైల్డ్ ప్రొటెక్షన్ పై అవగాహన

**వాకాడు, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త**



చైల్డ్ మ్యారేజ్, లేబర్ ప్రొటెక్షన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం వాకాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని స్త్రీ శక్తి భవనంలోని బాల రక్ష భారత్ సంస్థ ఆధ్వర్యంలో మండల ప్రజలకు అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోట, వాకాడు మండలాల్లోని దుగ్గరాజుపట్నం, బాలిరెడ్డిపాలెం, గోవిందపల్లి గ్రామాల్లోని సర్పంచులు సెక్రెటరీలు, అంగన్‌వాడి వర్కర్స్, ఏఎన్ఎంలు, స్కూల్ టీచర్స్ మహిళా పోలీస్ విద్యార్థిని విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. బాలరక్ష భారత్ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గీత మాట్లాడుతూ బాలలు చేత పనిచేయడం నేరమన్నారు. ముఖ్యంగా మగ పిల్లలను తీసుకెళ్లి మార్పిడి చేయిస్తున్నారనే పై ఆమె పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అదే విధంగా చైల్డ్ మ్యారేజ్ పై కూడా మాట్లాడారు. బాలరక్ష భారత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచెంగాళమ్మ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం లక్ష 16 రూపాయల విరాళం అందింది. సూళ్లూరుపేటకు చెందిన కొట్టే వెంకటరమణ సిద్ధాంతి ఈ నగదు మొత్తాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా అన్నదానానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మణ్ణి ఆశీస్సులతో తమకు అనుకున్న కొన్ని పనులు నెరవేరాయని, దీనితో అమ్మణ్ణికి మొక్కుగా నిత్యాన్నదానానికి ఈ నగదు ఇచ్చామన్నారు. అమ్మణ్ణికి అత్యంత ప్రీతిపాత్రమైన అన్నదానానికి తమవంతుగా నగదు అందజేయడం సంతోషంగా ఉందని వెంకటరమణ తెలిపారు.

## శ్రీగోకులకృష్ణ ఫార్మశిలో ఫార్మాసిస్టుల దినోత్సవం

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలోని శ్రీగోకులకృష్ణ ఫార్మశి కళాశాలలో ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఫార్మసిస్టుల పాత్ర నేటి సమాజంలో ఎంత అవసరమో అనే అంశాన్ని వివరించారు. అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఫార్మాసిస్టులు ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం అనే అంశం మీద విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, లోగో, స్లోగన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణలో జాతీయ సేవా సమితి విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటి ప్రపంచ ఫార్మశి దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. పట్టణంలో గోకులకృష్ణ ఫార్మశి కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గిలకా బ్రహ్మయ్య, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీదేవి, తొప్పాని స్వాతి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పేట శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి

**కోట, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**



పేదల, అట్టడుగు వర్గాల, వెనుకబడిన వర్గాల శ్రేయస్సు కోసం జనసంఘ్ దివంగత నేత పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ అహర్నిశలు శ్రమించారని, ఆయన అడుగు జాడలు అనుసరణీయమని భారతీయ జనతా పార్టీ కోట మండల అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక బిజెపి కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ 107వ జయంతిని నిర్వహించారు. ముందుగా దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీన్‌దయాల్ ఆశయాలకు అనుగుణంగా కేంద్రప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు పరుస్తుందని చెప్పారు. ఉజ్వల యోజన ద్వారా పేదలకు గ్యాస్, జన్‌ధన్ ఖాతాలు, ప్రధాని అవాజ్ యోజన ద్వారా పేదలకు ఇళ్లు, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా టాయిలెట్ల నిర్మాణం, దీన్‌దయాల్ గ్రామ జ్యోతి యోజన ద్వారా ప్రతి గ్రామానికి విద్యుత్ సరఫరా వంటి అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలను ప్రవేవపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథం వాసు, ఓబిసి మోర్చా కార్యదర్శి పోసిన వెంకయ్య గౌడ్, కోట మండల యోవమోర్చా అధ్యక్షుడు నికేష్‌పరశురాం సాయి, కోట మండల ఉపాధ్యక్షుడు లింగంగుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి చెంగయ్య మృతికి నివాళి

**పెళ్లకూరు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**

పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి గుంటపూడి చెంగయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. చెంగయ్య పార్థివదేహానికి ఎంపిపి పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పిటిసి సభ్యులు నన్నం ప్రిస్కిల్లా, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు వేలూరి మురళీకృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ కందమూడి శివకుమార్, చిల్లకూరు సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి తదితరులు నివాళి అర్పించారు. చెంగయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి



**బంగారుపాళ్యం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో రైతు ఉత్పత్తుల సంఘ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే రైతు భరోసా, ఆర్‌బికె కేంద్రాలు, సబ్సిడీ విత్తనాల పంపిణీ తదితర కార్యక్రమాలు వున్నాయన్నారు. అనంతరం మండల రైతు ఉత్పత్తుల సంఘ నూతన కార్యవర్గ అధ్యక్షుడుగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడుగా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గణపతి, ఉప కార్యదర్శిగా గీత, కోశాధికారిగా సుమంత్‌రెడ్డి, సభ్యులుగా జీవరత్నం నాయుడు, సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, రమణమ్మ, స్వప్న తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు జయమ్మ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 'దేశం' నిరసన దీక్షలు

**బంగారుపాళ్యం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:**



స్థానిక బస్టాండ్ సమీపంలోని బిపికెఎన్ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న దేశం నేతల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఈ నిరాహార దీక్ష శిబిరంలో జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, జిల్లా పార్లమెంటు కార్యదర్శి కోదండయాదవ్, మండల వాణిజ్య విభాగ అధ్యక్షుడు వంశీ చౌదరిలు పాల్గొని మాట్లాడారు. చంద్రబాబుపై సిఎం వైఎస్ జగన్ అక్రమంగా కేసులు నమోదు చేశారని ఆరోపించారు. త్వరలో బాబు జైలు నుండి బయటికి వస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోకనాధనాయుడు, రమేష్, కృష్ణకుమారి, హేమచంద్రనాయుడు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ -14,17 జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త**

కుప్పం ద్రవిడ వర్సిటీలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ -14,17 పోటీల్లో కుప్పం నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డిజిఎం కొండలరావు, ఎజిఎం అవధానం ఫణికుమార్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎజిఎం బాలకృష్ణ తెలిపారు. బాడ్మింటన్‌కు విధేయ, నిఖిత, టెన్నికాయిట్‌కు నవ్య, వాలీబాల్‌కు ధార్మిక, విజయేంద్ర వర్మ, కబడ్డీకి నవ్య, సౌమ్య, అథ్లెటిక్స్‌కు ధనుష్, సౌమ్య ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నరేష్, లక్ష్మణ్, విజయ్ పాల్గొన్నారు.

## శివయ్య నిత్యాన్నదాన ప్రసాదానికి గోంగూర వితరణ



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న అన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేషంగా విరాళాలు అందుతున్నాయి. తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల్లోని భక్తులు, దేశ విదేశాల్లోని భక్తులు విరాళాలను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాదుకుచెందిన ఎన్ వర ప్రసాద్ నిత్యాన్న ప్రసాదానికి 750కిలోల సొరకాయలు, 200 కట్టల గోంగూరను వితరణగా అందించారు. వీటిని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా అందజేసారు. ఈ కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సూర్యప్రసాద్, పట్టణ ప్రముఖులు సూరావారి సురేష్, గరికపాటి రమేష్, కిట్టు తదితరులు పాల్గొన్నారు. దాతలకు చైర్మెన్ శ్రీనివాసులు ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం, స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను బహూకరించి వేదపండితులచే ఆశీర్వదించారు.

## శివయ్య..జగనన్నకు మంచిబుద్ధిని ప్రసాదించు

-శివయ్య ఆలయంలో తెదేపా నేతల పూజలు



**తొట్టంబేడు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త** చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు బనాయించి రాక్షస ఆనందం పొందుతున్న జగన్ మోహన్‌రెడ్డికి మంచిబుద్ధిని ప్రసాదించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు ఆధ్వర్యం లో తొట్టంబేడు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి శివాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గాలిచలపతినాయుడు మాట్లాడుతూ అధికార మదంతో జగన్‌మోహన్‌రెడ్డి పోలీసు బలగాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకుడైన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అసత్య ఆరోపణలతో అక్రమంగా కేసులు పెట్టడం కక్ష సాధింపు రాజకీయాలకు పరాకాష్ట అని చలపతినాయుడు ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి, వన్నెకులక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, బిసి నాయకుడు మునిరాజయాదవ్, తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం. ఉమేష్‌రావు, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, సహకార బ్యాంకు మాజీ డైరెక్టర్ డివి.నారాయణ, భాస్కర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, బాలసుబ్రమణ్యం, భాస్కర్, శ్రీనివాసులు, ముని ప్రసాద్, నాగరాజు, చెందు, వంశీరాం, చలపతి, హరి, భూపాల్, నాగరాజ్, సాయి, దశరదయ్య, ఆదిరెడ్డి, చలపతి, సుబ్బయ్య, రమేష్, అయ్యప్ప, వెంకటేశ్వర్లు, వెంకటేష్, మనోహర్, ఆనందమ్మ, పుష్పలత, ధనలక్ష్మి, లక్ష్మి, ప్రభ, మంజుల, అంకమ్మ, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమం జగనన్నకు రెండు కళ్ళు: బియ్యపు పవిత్రారెడ్డి

**శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం ఆదేశించిన, నిధులు మంజూరు చేసిన 'నాడు నేడు పనులకు' సోమవారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయ బియ్యపు పవిత్రారెడ్డి భూమి పూజలు జరిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో మధన్న అభివృద్ధి, పేదల సంక్షేమం రెండు కళ్ళుగా పరిపాలన సాగిస్తున్నారని వివరించారు. నిరుపేదల ఇళ్ళకు ఆర్థికంగా సహాయం అందిస్తున్న ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. ఈ కార్యక్రమాల్లో పవిత్రమ్మతో పాటు మండల నాయకులు రామచంద్రయ్య, భాస్కర్, పోలయ్య, సురేష్, మస్తానయ్య, రమణమ్మ, శివకుమార్‌యాదవ్, సురేంద్రయాదవ్, చెంచులక్ష్మీ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడల పోటీలకు పల్లం విద్యార్థి

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్), సెప్టెంబర్ 25 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికవటం విద్యార్థిలోని పట్టుదలకు నిదర్శనం అన్నారు. సోమవారం ఆ విద్యార్థిని సత్కరించారు. మూడు రోజుల పాటు ఎన్‌టిఆర్ విజయవాడ రూరల్ మండలం "నున్న" వికాస్ విద్యాసంస్థల ఆవరణలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ అంతర్‌జిల్లాల రెజ్లింగ్ అండర్ 14 సంవత్సరాల పోటీలలో మోహనాచారి బంగారు పతకాన్ని సాధించటమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పాఠశాల నుంచి పోటీలకు వెళ్ళిన 8వ తరగతి చదువుతున్న నాగరాజు కాంస్య పతకాన్ని సాధించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని పుష్పవాణిని అభినందించారు. ప్రధానోపాధ్యాయుని సిబ్బంది దుశ్శాలువతో సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు బాబు, మోహర్‌బాబా, వాణి, రెడ్డెప్ప, సోమశేఖర్ రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఇతనెవరో గుర్తించండి:

శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం సరిహద్దులోని వెంకటగిరి జగనన్న లేఅవుట్ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా గుర్తించి తిరుపతి రుయాకు తరలించామని పోలీసులు తెలిపారు. సోమవారం వెంకటగిరి ఎస్ఐ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటగిరిజగనన్న లే అవుట్ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా ఆతన్ని మానవతా దృక్పథంతో రుయాకు తరలించామని తెలిపారు. అయితే ఆ వ్యక్తి ఎవరో ఏమిటో చెప్పె పరిస్థితిలో లేదన్నారు. అయితే ఆతని పక్కనే ఓ బైక్ ఉందని దాని నెంబర్ ఎపి 21 ఎహెచ్ 7123 గా ఉందన్నారు. ఈ వ్యక్తి ఎవరో గుర్తించాలని ఎస్ఐ కోరారు.

## పండిట్ దీనదయాళ్‌కు ఘన నివాళులు



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త** జాతీయవాది పండిట్ దీనదయాల్ జయంతి సందర్భంగా స్థానిక పాతబస్టాండు కూడలి వద్ద పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో దీనదయాల్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి కోలా. ఆనంద్‌కుమార్ హజరై ఆయనకు నివాళులు అర్పించారు. అనంతరం కోలా. ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో మరియు భారతీయ జనసంఘ్ అధినేతగా పాశ్చాత్య మూలాలకు చెందిన బ్రిటీష్ వ్యవస్థను పూర్తిగావ్యతిరేఖించి దేశ ప్రజల కోసం ఉపయోగపడే ప్రజాస్వామ్య వ్యవస్థను సృష్టించడం కోసం పోరాడారన్నారు. కార్యక్రమంలో పార్టీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, సుకుమార్, గోపాల్, వాసుయాదవ్, అయ్యప్ప, డిల్లీకుమార్, సుబ్రమణ్యం, గోపాల్, కిరణ్‌మణి, చెంగల్‌రాయరెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, బాలాజీ, భరత్, సాయితదితరులు పాల్గొన్నారు.

## గణపయ్యలను దర్శించుకున్న సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త** పట్టణంలోని స్థానిక బేరివారి మండపం వద్ద ఏర్పాటు చేసిన మట్టిగణపతిని, పెండ్లిమండపం వద్ద ఏర్పాటుచేసిన గణపతి విగ్రహాలను నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని రాష్ట్రంలో రావణకాష్టంగా ఉన్న పాలన అంతమవ్వాలని త్వరలోనే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తుందని అక్రమంగా అరెస్టుచేసిన తమ నాయకుడు చంద్రబాబునాయుడు వెంటనే విడుదల కావాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెంచయ్యానాయుడు, పోలూరుశ్రీనివాసులురెడ్డి, కాసరం రమేష్, గుర్రప్పశెట్టి, బీమాలమునికృష్ణ పలువురు తెదేపా నేతలు పాల్గొన్నారు.

## కోలాహలంగా..బేరివారి మండపం గణపతి నిమజ్జనం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త



వినాయకచవితి సంబరాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు నిమజ్జనానికి ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో సోమవారం స్థానిక బేరివారి మండపం వద్ద కాలుష్యరహిత మట్టిగణపతిని నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా. ఆనంద్ సారధ్యంలో మట్టిగణపతికి పూజాకార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా యువత జైభోళో గణేష్ మహరాజ్‌కీ జై అన్న నినాదంతో మారుమ్రోగింది పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో గణపతిని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమానికి బయలుదేరారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ప్రజలకు హాని కలిగించే ప్రాంతాల్లో క్వారీలు వద్దు

**నగరి, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** ప్రజలకు హాని కలిగించే ప్రాంతాల్లో క్వారీలకు అనుమతులు ఇవ్వవద్దని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి, అలాంటి వారిపై చర్యలు చేపట్టాలంటూ సీఐ సురేష్‌కు అడవికొత్తూరు, అడవి కండ్రిగ గ్రామాలకు చెందిన వారు వినతిపత్రం అందజేశారు. సోమవారం తహసీల్దార్‌ను, సీఐని అధిక సంఖ్యలో కలసిన గ్రామస్థులు వారితో మాట్లాడుతూ ప్రభుత్వానికి తప్పుడు సమాచారం అందించిన కొందరు క్వారీ దారులు ప్రజలు నివశించే ప్రాంతంలో సర్వేనెంబరు 285/1, 2లలో కొండల వద్ద క్వారీ నడపాలని చూస్తున్నారన్నారు. గతంలో ఇలాంటి క్వారీల కారణంగా గ్రామాల్లో ఇళ్లు కూలి మరణాలు సంబవించిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. అలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలన్నారు.

## కారు ఢీకొని పాదాచారుడు మృతి

పుత్తూరురూరల్, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:

కారు ఢీకొని పాదాచారుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు... తమిళనాడుకు చెందిన డీకే మణి సోమవారం కొండకు నడిచి వెళుతుండగా పుత్తూరు మండలం తడుకు పంచాయితీ పరిధిలోని తిరుపతి-చెన్నై జాతీయ రహదారి అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద నడిచి వెళుతుండగా వెనుక వైపు నుంచి కారు వేగంగా ఢీకొన్నాడు. ఈ సంఘటనలో డీకే మణికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు 108లో పుత్తూరు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఎన్‌టీఆర్ గాట్‌వద్ద టీడీపీ నాయకుల నిరసన

**వడమాలపేట, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు హైదరాబాద్‌లో ఎన్‌టీఆర్ గాట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సోమవారం టీడీపీ వ్యవస్థాపక నాయకుడు నందమూరి తారకరామారావు గాట్ వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గొర్ల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించడానికే స్పందన కార్యక్రమం

అధికారులు ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

మేయర్ డా. శిరీష, కమిషనర్ హరిత



**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త** సమస్యలు పరిష్కరించేందుకే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, అధికారులు ప్రజా సమస్యలను సకాలంలో పరష్కరించాలని నగర మేయర్ డా. శిరీష, కమిషణర్ హరితలు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష పాల్గొనగా, కమిషనర్ హరిత అర్జీలను స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 17, స్పందనకు 22 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఎన్జీవో కాలనీ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండానే టీ షాపు ఏర్పాటు చేసారనే పిర్యాదుపై కమిషనర్ స్పందిస్తూ వెంటనే ఆ షాపును పరిశీలించి అనుమతులు ఉన్నాయా లేవా అని పరిశీలించాలని, స్థలం ఆక్రమణకు గురై వుంటే తొలగించాలని అధికారులకు తగు సూచనలు జారీ చేసారు. అలాగే కొన్ని ఏరియాల్లో డ్రైనేజీ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ స్పందిస్తూ ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని సకాలంలో పరిష్కరించాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతుమాధవ్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్. నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, సర్వేయర్ దేవానంద్, సూపరింటెండెంట్‌లు, డిఈలు, ఆర్‌ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 28న పౌర్ణమి సందర్భంగా తిరువన్నామలైకి బస్సులు ఏర్పాటు

తిరుపతి రవాణా, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త

ఈ నెల 28, 29వ తేదిలలో పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువన్నామలై గిరి ప్రదక్షణ కోసం వేలాది మంది ప్రయాణికులు తిరుపతి జిల్లా నుండి పోతున్నందున జిల్లాలోని అన్ని డిపో నుండి బస్సులు ఏర్పాటు చేసామని ఏపి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జిల్లా ప్రజా రవాణా అధికారి తిమ్మాడి చెంగల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ డిపోలకు చెందిన బస్సులు తిరుపతి సెంట్రల్ బస్టాండ్, వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేట, సత్యవేడు, పుత్తూరు బస్సులు ఈ నెల 28వ తేది ఉదయం 5 గంటల నుండి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇందులో ఈ నెల 28వ తేది అమరావతి ఎసి బస్సులు 1, ఇంద్ర ఎసి బస్సులు 3, కాకుండా నాన్ ఏసి బస్సులు 90 బస్సులు వరకు నడపబడుతున్నదని తెలిపారు. అడ్వాన్సు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించబడిందన్నారు. రిజర్వేషన్ కావాల్సిన వారి యొక్క సెల్ఫోన్‌లో ఆన్‌లైన్ ద్వారా గానీ లేదా ఆయా బస్టాండులోని రిజర్వేషన్ సెంటర్లలో ద్వారా గానీ బుక్ చేసుకోవచ్చునన్నారు.

## ఎస్‌జిఎఫ్ అండర్ 19 స్విమ్మింగ్, కరాటే ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్ల ఎంపిక

**తిరుపతి (క్రీడ), సెప్టెంబర్ 25, ప్రభాతవార్త** ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ కరాటే జిల్లా బాల బాలికల జట్లను ఎంపిక జరుగునట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్. జయరామయ్య తెలిపారు. ఈ పోటీలకు ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్న బాలురు, బాలికలు మాత్రమే పాల్గొనాలని కళాశాలలో అకడమిక్ మానిటరింగ్ మాఫ్ ద్వారా రిజిస్టరు చేసుకోవాలన్నారు. స్టడీ సర్టిఫికేట్, 10వ తరగతి మార్కు లిస్టు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలన్నారు. ఈ నెల 30 వ తేది ఉదయం 9 గంటలకు శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయం తిరుపతి నందు స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అలాగే కెన్ భూ కామ్ షిటోరియా కరాటే స్కూల్ లింగ్ మూర్తి బిల్డింగ్, లింగేశ్వర నగర్ పద్మావతి పార్కు, బైరాగిపట్టెడ, తిరుపతిలో 30వ తేది ఉదయం 9.30 గంటలకు కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఎస్‌పిడబ్ల్యూ కళాశాలలో ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం



**తిరుపతి(విద్య) సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** సోమవారం స్థానిక శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్ డా॥సి. భువనేశ్వరి ఆధ్వర్యంలో 'జాతీయ సేవా పథకం'(ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం అనేది భారత ప్రభుత్వ యువజన మంత్రిత్వ శాఖ మరియు క్రీడలచే నిర్వహించబడే భారత ప్రభుత్వ రంగ సేవా కార్యక్రమమన్నారు. సమాజ సేవ ద్వారా విద్యార్థుల యొక్క వ్యక్తిత్వాన్ని పెంపొందింపచేసే లక్ష్యంతో గాంధీజీ శత జయంతి రోజైన సెప్టెంబర్ 24న ఇది పురుడు పోసుకోవడం జరిగిందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ చిహ్నమైన చక్రం సృష్టి, సంరక్షణకు సంకేతమని, అలాగే ఎరుపు రంగు స్వచ్ఛందంగా యువ రక్తంతో నిండి ఉంటుందని, యువత ఉల్లాసంగా చురుకుదనంగా ఉండాలని, అదేవిధంగా నేవీ బ్లూ రంగు మానవజాతి సంక్షేమాన్ని సూచిస్తుందని, దీని నినాదం 'నేను కాదు నువ్వు'(నాట్ మి బట్ యు) అని ఆమె వివరించారు. కావున విద్యార్థినిలు చదువుతో పాటు ఇలాంటి సేవా, పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆమె కోరారు. అనంతరం జాతీయ సేవా పథకం బాధ్యత వహిస్తున్న అధ్యాపకురాలు డా॥జి. శారద మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సంక్షేమ ఆలోచనలను నింపుకుని మానవ నిర్మిత విపత్తుల్లో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా గుర్తింపు పత్రాలు, బహుమతులు అందచేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా॥స్నేహలత, డా॥జయమ్మ, టి. యామిని సుధ, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**తిరుపతి(విద్య) సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** ఆదివారం స్థానిక పట్నూలువీధిలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల నందు తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి. మునికృష్ణనాయుడు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ ప్రాంతం వార్డు కౌన్సిలర్ బసవ గీత విచ్చేసి ఆమె చేతుల మీదుగా విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించడం జరుగుతోందన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యా యుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మునికృష్ణనాయుడు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుతున్న వారిలో ఎక్కువ మంది పేద విద్యార్థులేనని, అందుకేలయన్స్‌క్లబ్ తరపున ఉచితంగా విద్యాసామాగ్రి అందచేయాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసామాగ్రి దాతలు రాజేంద్రప్రసాద్, ఎమ్మార్ రాజా, బసవా బాలసుబ్రహ్మణ్యం, క్లబ్ సెక్రటరీ ముబారక్ బాషా, ట్రెజరర్ వినోద్ వెంకటాచలం, జిల్లా అదనపు కార్యదర్శి డా॥కె. రాజేంద్రప్రసాద్, కప్పా పద్మనాభం, లోకేష్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు జయంతి, హేమమాధురి, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నంగారి రమణకు ఘన సన్మానం



తిరుపతి(విద్య) సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:

సోమవారం టిటిడి విశ్రాంత ఉద్యోగి చిన్నంగారి రమణ జన్మదినం సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఊకా విజయ్‌కుమార్, ఆర్సీ. ముని కృష్ణ, పులుగోరు మురళీకృష్ణారెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి గజమాల వేసి దుశ్శాలువతో రమణను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.

## మత్తునిచ్చే మందులు విక్రయించరాదు..!

తిరుపతి రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రూత్

**చంద్రగిరి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** మత్తునిచ్చే మందులను (నార్కోటిక్స్ డ్రగ్స్) విక్రయించరాదని తిరుపతి రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రూత్ అన్నారు. సోమవారం ఆమె చంద్రగిరిలో పలు మెడికల్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన వైద్యుల సిఫార్స్ లేనిదే మందులు ఇవ్వరాదని తేల్చిచెప్పారు. కాలం చెల్లిన మందులు ఇవ్వరాదని, కాదని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెడికల్ షాపులో ఫార్మాశిస్ట్ తప్పనిసరిగా వుండాలన్నారు. కొన్ని మందులను రిఫ్రిజిరేటర్‌లోనే పెట్టాలన్నారు. యాంటీబయోటిక్స్ ఇష్టానుసారంగా విక్రయించరాదని స్పష్టం చేశారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ



**చంద్రగిరి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త:** స్థానిక శ్రీపద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సోమవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల నిర్ధారణతో పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఇందులో రోలేటర్స్ -2, ట్రైసైకిల్ -1, వీల్ చైర్స్ 9, క్యాలీఫర్ -1, టిఎల్ఎం -35, వినికిడి పరికరాలు 18, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈ కోఆర్డినేటర్ డి. చంద్రశేఖర్ రెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ వి. రామచంద్రారెడ్డి, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఐఈడిఎస్ఎస్ ఉదయ్‌కుమార్, ఫిజియోథెరపిస్ట్ ఎస్. సరళకుమారి, టిఈఆర్‌టి (ఐ.డి) ఎన్. వెంకట రాజేశ్వరి, ఐఈఆర్‌టి (హెచ్.ఐ) ఎస్. శ్యామలాదేవి బి. సుమ, తదితరులు పాల్గొన్నారు.

## ఆ ముగ్గురు అధికారులను ఎందుకు ప్రశ్నించడం లేదు

సత్యవేడు తెదేపా ఇన్‌చార్జ్ హెలెన్



**సత్యవేడు, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :** స్కిల్ స్కాం అంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై సాక్ష్యాలులేని అక్రమ కేసు బనాయించారన్న విషయం తెలుగురాష్ట్రాల ప్రజలకు భాగా తెలుసుననిసత్యవేడు తెదేపా ఇన్‌చార్జ్ హెలెన్ పేర్కొన్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రకరకాల కేసుల్లో ఇరికించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆనందం పొందడం సరైన చర్యకాదని ఆమె చెప్పుకొచ్చారు. కోట్ల రూపాయలు పక్కదారి పట్టిందని సిఐడి అధికారులు ప్రచారం చేస్తున్నారే గాని, అప్పటి ఐఎఎస్ అధికారులు ప్రేమ్‌చంద్రా రెడ్డి, వెంకటరామిరెడ్డి, అజయ్ కల్లాం రెడ్డిలను ప్రశ్నించిక పోవడంలో ఆంతర్యం ఏమిటో సిఐడి అధికారులు, ప్రభుత్వం వెల్లడించాలని ఆమె డిమాండ్ చేశారు. చంద్రబాబును, లోకేష్‌ను, కొంతమంది సీనియర్ నాయకులను జైలుకు పంపితే సలువుగా అధికారం దక్కించుకోవచ్చునని భ్రమలో జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని హెలెన్ చెప్పారు.

# తిరుపతి డివిజన్

## 27న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

**పుత్తూరు, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** ఈ నెల 27న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్, కెమిస్ట్రీ విభాగం, కాంచీపురానికి చెందిన బయోసైన్స్ రీసెర్చ్ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ లేదా జువాలజీ చేసిన వారితో పాటు ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్న వారు కూడా అర్హులని తెలిపారు. నెలకు రూ. 17,000 వేలు జీతం లభించే ఈ ఉద్యోగం కోసం ఆసక్తి వున్న అభ్యర్థులు బయోడేటా, మార్క్స్ లిస్ట్ జెరాక్స్, ఒరిజినల్ ఐడి ప్రూఫ్‌తో ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు కాలేజీలోని సెమినార్ హాలుకు హాజరవ్వాలని తెలిపారు. రాత పరీక్ష, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు జెకెసి సమన్వయకర్త సంధ్య ఆదూరి (8801325220), డాక్టర్ ఎం. శంకర్‌రావు (9491806362) మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## సమాజ సేవ ఒక బాధ్యతగా భావించాలి

ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసులురెడ్డి

**పుత్తూరు, సెప్టెంబరు 25 ప్రభాతవార్త :** విద్యార్థులు సమాజ సేవ చేయడం ఒక బాధ్యతగా భావించాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసులురెడ్డి అన్నారు. కాలేజీలో సోమవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల నుంచి సమాజంలోకి అనేది ఎన్ఎస్ఎస్ నినాదమని తెలిపారు. విద్యార్థులు చదువుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్‌లో నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు డాక్టర్ కె. శ్రీనివాసులు, డాక్టర్ రఘురామన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, రాష్ట్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం పనిచేస్తుందని, ఎన్ఎస్ఎస్‌లో చేరిన విద్యార్థులు సమాజాన్ని తమ కుటుంబంలా భావిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి. వీరయ్య, టి. నరసింహులు, డాక్టర్ ఎ. దేవకి, డాక్టర్ ఆర్. బి. వాణిశ్రీ, డాక్టర్ సురేష్, డాక్టర్ ధర్మారావు, డాక్టర్ గాయత్రి, డాక్టర్ ఎం. శ్రీనివాసులు, డాక్టర్ సుజల తదితరులు పాల్గొన్నారు.

## నాగబాబును కలిసిన మండల జనసేన అధ్యక్షులు బంగి శివలింగం

**నింద్ర, సెప్టెంబరు 25 ప్రభాతవార్త: :** రాష్ట్ర జనసేన నాయకులు నాగబాబును సోమవారం నింద్ర మండల జనసేన అధ్యక్షులు బంగి శివలింగం కలిసి పార్టీ బలోపేతం గురించి మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బంగి శివలింగం మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో నియోజకవర్గస్థాయి మూడుస్థానంలో వున్నట్లు తెలిపారు. మండలంలోని పాదిరి గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త మణికంఠం ప్రమాదంలో మరణించడంతో పార్టీ తరపున ఐదు లక్షల రుపాయిలు ఆర్థిక సాయం అందజేసినారన్నారు. ఆర్థిక సాయం అందజేయడంపై పవన్‌కళ్యాన్, నాగబాబుకి కృతజ్ఞుతలు తెలిపారు.

## రేపు స్విమ్స్ యూనివర్సిటీ మహిళా వైద్య కళాశాల విద్యార్థినీలకు మోటివేషనల్ టాక్

**తిరుపతి టౌన్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త** స్విమ్స్ యూనివర్సిటి మహిళా వైద్య కళాశాల విద్యార్థినులకు ఈ నెల 27వ తేది బుధవారం మహతి ఆడిటోరియంలో మోటివేషనల్ టాక్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎవి ధర్మారెడ్డి విచ్చేసి వైద్య విద్యార్థినిలకు ప్రేరణాత్మక చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి టిటిడి జెఇఓ సదాభార్గవి, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ పాల్గొననున్నట్లు తెలిపారు.

## చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరాహారదీక్ష



**నగరి, సెప్టెంబరు 25 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ బాబుతో మేము సైతం అంటూ నగరి అర్బన్, రూరల్ మండలం ఆధ్వర్యంలో నగరిలో నిరాహారదీక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్షతో చంద్రబాబును అరెస్టు చేసి అంతర్జాతీయంగా జగన్మోహన్‌రెడ్డి తెలుగువారి ప్రతిష్టను దిగజార్చరన్నారు. చంద్రబాబుకు అండగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉంటారని, వారంతా కలసికట్టుగా మాతృదేశంపై అభిమానాన్ని చాటుకోవాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై లేని కేసులు ఆపాదించి, అనవసరంగా ఆయన్ని అక్రమంగా అరెస్టు చేసిందన్నా రు. పెద్ద ఎత్తున తెలుగు ప్రజలు, వారి కుటుంబ సభ్యులు, చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. బాబును వెంటనే విడుదల చేయాలని నినాదించారు. కార్యక్రమంలో నగరి పట్టణ ప్రెసిడెంట్ రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, నగరి రూరల్ ప్రెసిడెంట్ శివకుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, గుణశేఖర్, బాల సురేష్, కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, నారాయణస్వామి, వడివేలు, సంగీత, మాజీ జడ్పీటీసీ వెంకటరత్నం, చిట్టి, శివ, మహేంద్రన్, కామేష్, అయ్యప్ప, చంద్రశేఖర్, శేఖర్, వేణు, నిఖేష్, మహేష్, కన్నివేలురెడ్డి, పరందామనాయుడులు పాల్గొన్నారు.

## దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి పండిట్ దీన్ దయాళ్

బిజేపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపినాథ్ రెడ్డి



**తిరుపతి రవాణా, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త** దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి పండిత్ దీన్ దయాళ్ అని జిల్లా బిజెపి సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపినాథ్ రెడ్డి పేర్కొన్నారు. దీన్ దయాళ్ 107వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పాటుపడిన గొప్ప మహనీయుడు, అన్ని కులాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి దీన్ దయాళ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కవిత, జయంతి కుమార్, టి. సుబ్రమణ్యం రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతాహి సేవ... సర్పంచ్ ఆధ్వర్యంలో ర్యాలీ




**రేణిగుంట, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** రేణిగుంట పంచాయతీ సర్పంచ్ నాగేషం ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా స్వచ్ఛతాహి సేవ ర్యాలీ జరిగింది. రేణిగుంట పట్టణంలోని అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్ర పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు ఎలాంటి అంటు రోగాలు సంభవించకుండా పారిశుధ్యానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. ఎక్కడ పారిశుధ్యం లోపించిన పంచాయతీ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. పారిశుధ్య విషయంలో రాజీపడమన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలను వేల కట్టలేము

-సర్పంచ్ పొట్టేలి లీలరాణి రవికుమార్ - రామానుజపల్లిలో పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం



**తిరుపతిరూరల్, సెప్టెంబర్25 ప్రభాతవార్త:** పారిశుధ్య కార్మికుల సేవలు వేల కట్టలేమని, కార్మికుల సేవలు ప్రసంశనీయమని రామానుజపల్లి గ్రామ సర్పంచ్ పొట్టేలి లీలరాణి రవికుమార్ అన్నారు. సోమవారం తిరుపతిరూరల్ రామానుజల్లి గ్రామ పంచాయతీలో "స్వచ్ఛతా-హి-సేవ" కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ లీలరాణి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికులు కూడా భాగస్వామ్యం ఉందన్నారు. సమాజంలో ఆరోగ్యకరమైన వాతారణం కల్పించడంలో వారి పాత్ర అమోఘమన్నారు. రామానుజపల్లిలో పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ పొట్టేలి లీలరాణి తెలిపారు. కార్మికులు సంక్షేమంగా ఉంటేనే పంచాయతీ కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యధర్శి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

జిల్లా టూరిజం అధికారి రూపేంద్రనాధ రెడ్డి



**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త** ఈ నెల 27వ తేది బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతిలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి రూపేంద్ర నాధ రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు రామానుజ సర్కిల్ నుండి శిల్పారామం వరకు 2కె రన్, సాయంత్రం శిల్పారామంలో 6.30 గంటలకు వివిధ సాంస్కృతిక వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ప్రసంశా పత్రాలు, మెమెంటోలు అందించడం జరుగుతుందని ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఎస్‌పి, అధికారులు హాజరుకానున్నారని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టూరిజం అధికారి తెలిపారు.

## తెదేపా నేత మృతి

**సత్యవేడు, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త:** మండలంలోని సిరినంబుదూరులో మాజీ ఎమ్మెల్యే సురాజ్ సోదరుడి కుమారుడు, తెదేపా నేత స్టీఫెన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే హేమలత, తెదేపా ఇన్‌చార్జ్ డాక్టర్ హెలెన్‌లు తమ పార్టీ కార్యకలతో కలిసి స్టీఫెన్ భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్టీఫెన్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు.

## ఘనంగా పండిట్ దీనదయాల్ జయంతి వేడుకలు

సత్యవేడు, సెప్టెంబర్ 25, ప్రభాతవార్త :



అట్టడుగు వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేసిన పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతిని సోమవారం సత్యవేడులో స్థానిక బీజేపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆపార్టీ మండల అధ్యక్ష్యుడు మునిప్రతాప్ మాట్లాడుతూ జనసంగ్ ఉపాధ్యక్ష్యుడిగా భాధ్యతలు తీసుకుని శ్యాంప్రసాద్ ముఖర్జీ మరణానంతరం పూర్తి స్థాయిలో పార్టీ అభ్యున్నతికి ఏకాత్మకవాద సిద్ధాంతంతో ముందుకెళ్లారని తెలిపారు. ఈకార్యక్రమంలో భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్ష్యుడు మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి వాసు, మురళి, బుచ్చిబాబు, చెంచయ్య, వెంకటేశ్వర్లు, మోహన్‌బాబు, రాజేంద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# వెంకటేశ్వరస్వామి సన్నిధికి పరుగులు పెడుతున్న వందేభారత్


వందే భారత్ ప్రారంభోత్సవ దృశ్యమాలిక

రేణిగుంట, సెప్టెంబరు 25 ప్రభాతవార్త: విజయవాడ-చెన్నైల మధ్య రేణిగుంట మీదుగా వారానికి ఆరు రోజులు (మంగళవారం మినహా) సేవలం దించే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రధాని మోదీ డిజిటల్ సిస్టం ద్వారా ప్రారంభించి పట్టాలపై పరుగులు పెడుతోంది. ఆజాదీకా అమృత ఉత్సవ్ మేకిన్ ఇండియా లో భాగంగా అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన సేవలు అందిస్తూ సమయాభావాన్ని తగ్గించి ప్రయాణి కులను గమ్య స్థానాలకు చేరుస్తోంది. విజయవాడ నుంచి 6 గంటల 40 నిమిషాల్లో చెన్నై వెళుతుంది. తిరుగు ప్రయాణంలో కూడా అంతే సమయం తీసుకుని గమ్య స్థానానికి చేరుకుంటుంది. వందే భారత్ రైలు ఉదయం 5.30 గంటలకు చెన్నైలో బయలుదేరి మధ్యాహ్నం 12.10 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. మధ్యాహ్నం 3.20 విజయవాడలో బయలుదేరి రాత్రి 10 గంటలకు చెన్నై చేరుతుంది. రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు తెనాలి స్టేషన్‌ల్లో మాత్రమే రైలు ఆగుతుంది. రైలుకు స్వాగతం పలకడా నికి రైల్వే అధికారులు దాదాపు 200 మంది విద్యార్థులను ఆదివారం ప్రత్యేక రైలులో బిట్రగుంటకు తీసుకెళ్లారు. సాయంత్రం బిట్రగుంట చేరుకున్న విద్యార్థులు విజయవాడ నుంచి బయలుదేరిన బిట్రగుంట చేరుకున్న వందే భారత్ రైలుకు స్వాగతం పలికి అదే వందే భారత్ రైల్లో రేణిగుంటకు తిరుగు ప్రయాణమయ్యారు. వీరికి రైల్వే అధికారులు ఉచిత ప్రయాణంతో పాటు భోజనాది సౌకర్యాలు కల్పించారు. గుంతకల్ ఏడీఆర్ఎం సూర్య నారాయణ, ఏసీఎం రవి, ఏవో అలీ పర్యవేక్షణలో వివిధశాఖల రైల్వే అధికారుల సహకారంతో కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగింది. ఇలాంటి అధునాత నమైన వందే భారత్ లాంటి రైళ్ళను స్వదేశీ తయారీ, పరిజ్ఞానంతో పట్టాలపై ఎక్కించిన భారత ప్రధాని మోదీని అందరూ అభినందిస్తున్నారు. శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తరపున ఆయన కుమార్తె పవిత్రరెడ్డి రేణిగుంట సర్పంచ్ నాగేషం, పలువురు వైసీపీ నేతలతో కలిసి స్వాగతం పలికి రేణిగుంట వరకు ప్రయాణించి రైలు ప్రయాణం అద్భుతంగా ఉందని మోదీని పొగిడారు. అప్పటికే రైల్లో ఉన్న జీఆర్పీ తిరుపతి డీఎస్పీ షాను, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ బీసీవీ రాజుతో పవిత్రరెడ్డి పలు విషయాలపై చర్చించారు. విజయవాడ నుంచి చెన్నై వరకు దారి పొడవునా వివిధ రైల్వేస్టేషన్‌ల్లో ప్రజలు రైలుకు జాతీయ జెండాలు ఊపుతూ కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం, బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు బీడీ బాలాజీ, పలువురు బీజేపీ నేతలు, విద్యార్థులు, ప్రజలు రైలుకు స్వాగతం పలికారు. అంతకు ముందు బీజేపీ నేతలు రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగిస్తూ బీజేపీ చేస్తున్న అభివృద్ధిని, మోదీ పరిపాలన దక్షతను పొగడతలతో ముంచెత్తారు. పలువురు విద్యార్థులను సన్మానించారు. రేణిగుంట రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సందీప్, తిరుపతి రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, చిత్తూరు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, జీఆర్పీ సీఐ దేవేంద్రకుమార్, హేమ సుందర్, రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ అనిల్ తమ సిబ్బందితో పటిష్టమైన భద్రతను చేపట్టారు.

## వందే భారత్ రైలును శ్రీకాళహస్తిలో నిలపాలి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : ప్రభుత్వం మధ్యతరగతి ప్రయాణీకుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న 'వందేభారత్ రైలు'ను శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో స్టాపింగ్ అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఆదివారం భారత ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానం ద్వారా విజయవాడ-చెన్నై సెంట్రల్‌కు వయా రేణిగుంట వందేభారత్ రైలును ప్రారంభించారు. కొన్ని దశాబ్దాలుగా శ్రీకాళహస్తి ప్రజలు శ్రీకాళహస్తి నుంచి నేరుగా చెన్నైకు రైలు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ చింతా మోహన్ మంత్రిగా ఉన్నపుడు శ్రీకాళహస్తి-బుచ్చినాయుడు కండ్రిగ-సూళూరుపేట మధ్య రైలు లైన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం వందేభారత్ రైలు శ్రీకాళహస్తి చెన్నై మధ్య ప్రయాణీకులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతానికి వచ్చే తమిళ,విజయవాడ భక్తుల సౌకర్యార్థం వందేభారత్ రైలును హాల్ట్ ఇస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## షార్‌లో ఘనంగా సతీష్‌ధవన్ జయంతి వేడుకలు



శ్రీహరికోట (తడ), సెప్టెంబర్ 25 ప్రభాతవార్త :శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ఇస్రో మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ సతీష్‌ధవన్ జయంతికి అంతరిక్ష శాస్త్రవేత్తలు ఘనంగా నివాళి అర్పించారు. షార్‌లోని జీరోపాయింట్ వద్ద ఉన్న ధవన్ విగ్రహానికి పూజలు చేసి నివాళి అర్పించారు. సతీష్‌ధవన్ పేరుతో నిర్మించిన మెమోరియల్ ఆసుపత్రిలో ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీహరి కోటతో ధవన్‌కు ఉన్న సంబంధాలను ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తదితరులు గుర్తు చేసుకున్నారు. ఇక్కడి ప్రకృతి అందచందాలు, వలస విహంగాల కేరింతలు, అమాయకులైన యానాదుల జీవితాలు, వివిధ విలువైన వృక్ష జాతులు ధవన్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఎంతో ఆకట్టుకున్నాయని పలువురు శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 1920 సెప్టెంబర్ 25న శ్రీనగర్‌లో జన్మించిన ధవన్ 1972లో డాక్టర్ విక్రమ్ సారాభాయ్ హఠాన్మరణానంతరం ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి అంతరిక్ష పరిశోధనలో ఎన్నో మైలురాళ్లను ఆయన అధిగమించారు. ముఖ్యంగా రాకెట్ ప్రయోగ కేంద్రమైన శ్రీహరికోటలో ఎస్ఎల్‌వి3 ప్రాజెక్టుకు సారథ్యం వహించారు. ఇటీవల చంద్రయాన్-3తో ప్రపంచ ప్రఖ్యాతి సాధించిన ఇస్రో అభివృద్ధి అభివృద్ధిలో ధవన్ పాత్ర ఎంతో ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు కొనియాడారు. డైరెక్టర్ రాజరాజన్‌తో పాటు అసోసియేట్ డైరెక్టర్ హమీద్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, కార్యక్రమాల అమలు ఛైర్మన్ శంకరన్, పలు విభాగాల డిప్యూటీ డైరెక్టర్లు రఘురామ్, రమేష్‌బాబు, సెంధిల్‌కుమార్, గ్రహందొరై, ముత్తుచెలియన్, సునీల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## కరాటే కుంగ్‌ఫూలో స్వర్ణ పతకం సాధించిన విద్యార్థులు



బాలాయపల్లి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: ఈ నెల 24న హైదరాబాద్ కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ 2023 పోటీలలో వరిసిద్ధి వినాయక ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న ఎన్.బిందుజ స్వర్ణ పతకం, వై.లాక్షిత, వి.వైష్ణవిలు కాంస్యపతకాలు సాధించారని కరస్పాండెంట్ శంకరమ్మ తెలిపారు. మాస్టర్ శివశంకర్, ఎన్.బిందుజ, వై.లాక్షిత, వి.వైష్ణవిలను కరస్పాండెంట్ శంకరమ్మ, ప్రిన్సిపాల్ జయలక్ష్మీ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. సినీ హీరో డాక్టర్ సుమన్ చేతుల మీదుగా వీరు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకోవడం హర్షదాయకమన్నారు. ఇలాగే ప్రతిభ కనబరచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కరస్పాండెంట్ శంకరమ్మ తెలిపారు.

## జల దిగ్బంధంలో జూనియర్ కళాశాల



చౌడేపల్లి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జలదిగ్బంధంలో వుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కళాశాలలోకి నీరు చేరుకొన్నాయి. ఏకంగా తరగతి గదుల్లోకే నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గదుల్లోని రికార్డులు, పుస్తకాలు నీట మునిగాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## రాష్ట్ర స్థాయిలో తిరుమలయ్యపల్లె విద్యార్థుల ప్రతిభ

వెదురుకుప్పం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో తిరుమలయ్యపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచిన్నట్లు ఫిజికల్ డైరెక్టర్ త్రిలోకసుందరి సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పాఠశాలకు చెందిన రేశ్వంత్ కుమార్, దీక్షా రెడ్డిలు ఈ నెల 21 నుంచి 24 వరకు కృష్ణా జిల్లా నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో జరిగిన పోటీలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి వెండి, రజిత పథకాలు సాధించినట్టు చెప్పారు. బాలుర 48 కేజీల విభాగంలో రేశ్వంత్ రెడ్డి వెండి పతకం, బాలికల 57 కేజీల విభాగంలో దీక్షాత రెడ్డి రజిత పథకం సాధించారన్నారు. సందర్భంగా పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి, ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలు అవసరమని, స్థాయిలో రాణించి గుర్తుంపు పొందిన వారిని స్పూర్తిగా తీసుకుని అందరు రాణించాలని చూచించారు.

## చంద్రబాబు అరెస్ట్‌కు దేశం నేతల నిరసన

పెద్దపంజాణి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని పెద్దవెలగటూరు, మదనరాజుపల్లి గ్రామాల్లో తెదేపా నేతలు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు ఆనంద, చలపతి, నాగిరెడ్డి, మురళీక ృష్ణ, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, మంజునాథరెడ్డి, నాగరాజు, బాలకృష్ణారెడ్డి, రుద్రమూర్తి నాయుడు పాల్గొన్నారు.

## గుండెపోటుతో తెలుగుదేశం కార్యకర్త మృతి



పెద్దపంజాణి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు బయలుదేరిన ఓ కార్యకర్త గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని శివాడి గ్రామంకు చెందిన చిలగట్టు కనకరాజు (46) తెలుగుదేశం పార్టీ వీరాభిమాని. సోమవారం ఇతను మండలంలోని రాజుపల్లి, మాదనపల్లి, వెలగటూరు పంచాయతీల్లో బాబుతోనేను కార్యక్రమంలో పాల్గొనేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరగా మార్గమధ్యంలో గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దేశం నేతలు మృతుడి స్వగ్రామం చేరుకుని అతనికి పార్టీ జెండా కప్పి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేతలు ఆనంద, చలపతి, నాగిరెడ్డిలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు ఆత్మ క్షోభ



చంద్రగిరి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనా దుస్థితిపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆత్మక్షోభిస్తుందని నియోజవర్గ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దుయ్యబట్టారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద సోమవారం 12వ రోజు చంద్రబాబు అరెస్ట్‌ను నిరశిస్తూ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్ష చేపట్టిన దళిత నాయకులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని సంఘీ బావం ప్రకటించారు. దళితుల సంప్రదాయ డప్పు (పలక)ను వాయిస్తూ వారిలో చైతన్యం నింపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏదో చేస్తాడని జగన్ మాయమాటలను నమ్మి దళితులు మోసపోయారన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులను దారి మళ్ళించిన ఘనుడు జగన్ అంటూ ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రామారావు, శరవణ, కిరణ్, చిరంజీవి, మహేష్, బాలాజీ, టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, జిల్లా ఉపాధ్యక్షురాలు లంకెళ్ళ లలిత, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, నాయకులు కన్నయ్య నాయుడు, వీరంగారి రమేష్ రెడ్డి, శివకోటిరెడ్డి, గిరిధర్ రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, పెరుమాళ్‌పల్లి రఘునాధ రెడ్డి, ఉమాపతి రెడ్డి, ఏ.జి.పల్లి బాల, గౌస్‌భాషా, కాపువీధి సునీల్, మండలం లోకేష్ రాయల్, ప్రభాకర్ నాయుడు, అనార్కలి, మల్లికమ్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

### నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ చెరుకు బకాయిలపై
## జనసేన నాడు ప్రేక్షక పాత్ర.. నేడు విమర్శలు



నింద్ర, సెప్టెంబరు 25 ప్రభాతవార్త: నింద్ర మండలం నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతులకు చెల్లించవలసిన బకాయిలు విషయంలో నాడు ప్రేక్షక పాత్ర నేడు ప్రభుత్వంపై విమర్శిలు చేయడం విడ్డూరంగా వుందని నింద్ర మండల వైయస్ఆర్‌సిపి నాయకులు తీవ్రంగా విమర్శించినారు. సోమవారం మండల కేంద్రంలో వైయస్ఆర్‌సిపి నాయకులు మాట్లాడుతూ నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ యాజమాన్యం చెరుకు రైతులకు 2018 సంవత్సరం రైతులకు చెల్లించవలసిన చెరుకు బకాయిలు 36కోట్లు అప్పటి తెలుగుదేశం పార్టీ అధికారంలో వుండినప్పుడు నిలిచిపోయిందని,అప్పుడు జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీతో పొత్తులో వుందని, ఆ దినం మాట్లాడని జనసేన నాయకులు ఈ దినం వైయస్ ఆర్‌సిపి ప్రభుత్వం విమర్శలు చేయడం తగదన్నారు.చెరుకు బకాయిలు చెల్లించాలని రైతులు ప్యాక్టరీ ఎదుట ధర్నా చేయగా దీనిపై ప్రభుత్వం స్పందించి కలెక్టర్‌చే విచారించి ఇప్పటికే చెరుకు బకాయిలు చెల్లించాలని యాజమాన్యానికి ఐదు నోటీసులు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో యంపిపి దీపాజలంధర్‌రాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి,నాయకులు రాము, చార్లీ, శివలింగం ఆచ్చారి, రమేష్, ఏయుమలై ఆచ్చారి,వీరయ్యనాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు తక్షణ చర్యలు : అదనపు ఎస్పి వెంకట్రావు



తిరుపతి క్రైం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలకు తక్షణ చర్యలు చేపడుతామని అదనపు ఎస్పి వెంకట్రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అదనపు ఎస్పి వెంకట్రావు, ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలకు సానుకూలంగా సనపందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను ఖుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ప్రజలు ఫిర్యాదులు చేసారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 86 మంది వచ్చి వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు.

## రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో... ధనుష్‌కుమార్, అంజలికి బంగారు పతకాలు



వడమాలపేట, సెప్టెంబరు 25 ప్రభాతవార్త: అండర్-17 రాష్ట్ర స్థాయి బాల బాలికల రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట విద్యార్థులను ధనుష్ కుమార్, అంజలి బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు కృష్ణా జిల్లా నున్న గ్రామంలో ఆంధ్రప్రదేశ్ క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన అండర్-17, అండర్-14, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 14 మంది ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో అంజలి 36 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని ధనుష్‌కుమార్ 110 కిలోలు గ్రీకో రోమన్ విభాగంలో బంగారు పతకాన్ని, యూనిస్ 60 కిలోల ఫ్రీ స్టైల్ విభాగంలో రజత పతకాన్ని మానస 58 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. బంగారు పతకాలు సాధించిన అంజలి అక్టోబర్ 3వ తేదీ నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భూపాల్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ధనుష్‌కుమార్ నవంబరు నెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణ నవనీతం, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

## అధికారులను ఎందుకు ప్రశ్నించడం లేదు : హెలెన్



సత్యవేడు, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : స్కిల్ స్కాం అంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై సాక్ష్యాలులేని అక్రమ కేసు బనాయించారన్న విషయం తెలుగురాష్ట్రాల ప్రజలకు భాగా తెలుసునని సత్యవేడు తెదేపా ఇన్‌చార్జ్ హెలెన్ పేర్కొన్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రకరకాల కేసుల్లో ఇరికించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆనందం పొందడం సరైన చర్యకాదని ఆమె చెప్పుకొచ్చారు. కోట్ల రూపాయలు పక్కదారి పట్టిందని సిఐడి అధికారులు ప్రచారం చేస్తున్నారే గాని, అప్పటి ఐఏఎస్ అధికారులు ప్రేమ్‌చంద్రా రెడ్డి, వెంకటరామిరెడ్డి, అజయ్ కల్లాం రెడ్డిలను ప్రశ్నించిక పోవడంలో ఆంతర్యం ఏమిటో సిఐడి అధికారులు, ప్రభుత్వం వెల్లడించాలని ఆమె డిమాండ్ చేశారు. చంద్రబాబును, లోకేష్‌ను, కొంతమంది సీనియర్ నాయకులను జైలుకు పంపితే సలువుగా అధికారం దక్కించుకోవచ్చునని భ్రమలో జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని హెలెన్ చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌కు గాయాలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం నుంచి పవిత్రోత్స వాలు ప్రారంభమ య్యాయి. ఈ నేపధ్యంలో వేకువ జామున విధుల నిర్వహణకు హరియాదవ్ పానగల్ నుంచి తన ద్విచక్రవాహనంపై బయలు దేరారు. వర్షం కురుస్తుం డటంతో చేతిలో గొడుగుతో వెళుతుండగా పొన్నాలమ్మ గుడి దాటిన తరువాత వెనుక నుంచి ఓ ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన హరియాదవ్‌ను ఆటో డ్రైవరే ఆసుపత్రికి చేర్చగా కాళ్ళు చేతులకు బలమైన గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు.

## చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసన

### -'బాబుగారితో మేము' సంతకాల సేకరణ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ శ్రీకాళ హస్తి, ఏర్పేడు మండల టిడిపి నాయకులు ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద నిరసన కార్యక్రమంను పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ పోస్టుకార్డు ద్వారా నారాచంద్రబాబునాయుడుకు 'బాబుతో మేము' సందేశం తెలియపరచారు. అనంతరం ఎస్సీ నాయకులతో కలసి రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం బదులు రాజారెడ్డి, జగన్‌రెడ్డిల రాజ్యాంగం నడుస్తోందని త్వరలోనే ఇలాంటి రాజ్యాంగాలకు ప్రజలు గుణపాఠం చెప్తారని తెలిపారు. అలాగే 'బాబు గారితో మేమే' అన్న బ్యానర్‌పై సంతకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, దశరధా చారి, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, చెంచయ్యనాయుడు, ధనంజయులు నాయుడు, శివశంకర్‌రెడ్డి, నాగరాజునాయుడు, రాజేష్‌నాయుడు, గుణయాదవ్, పాపిరెడ్డి, ప్రసాద్‌నాయుడు, చంద్ర, మునిరెడ్డి, శివాజీరెడ్డి, అంకయ్య, రవినాయుడు, సీతాపతి ఆచారి, శ్రీధర్, నాగేశ్వరరావు, రాఘవేంద్ర, సురేష్, కృష్ణవేణి, హంస, అశ్వర్థామ, నరసింహులు, మోహన్, వెంకయ్య, మునిరామరెడ్డి, నాధముని రెడ్డి, తొట్టంబేడు, శ్రీకాళహస్తి అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, కామేష్ యాదవ్, నాయకులు కాసరం రమేష్, ప్రతాప్‌రెడ్డి, దొరైరాజ్‌రెడ్డి, ఆర్ముగం, గుర్రప్పశెట్టి, ప్రకాష్ నాయుడు, రేణుకమ్మ, సుమతి, మల్లీశ్వరి, జిలానీబాష, గోపినాధ్, పోలూరుశ్రీనివాసులురెడ్డి, ఎంఎస్ రెడ్డి, చుక్కలరమేష్, దొరస్వామి, నరసింహులు, అనిత, సుభాషిణి, దుర్గమ్మ, కృష్ణమనాయుడు, అమరావతి, సాయినాయుడు, శాంతమ్మ, చంద్రకళ, ఊహ, జయశ్రీ. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో నేడు (మంగళవారం)

పగలు : అభిషేకం, బిక్షాండి... ఉభయదారులు: దేవస్థానం వారిచే,తిరుకళ్యాణం
ఉభయదారులు : కాణిపాకం, తిరువణంపల్లె, వణిగ వంశస్థులు
రాత్రి : అశ్వవాహనసేవ
ఉభయదారులు: బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజ వంశస్థులు.

ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు : ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు కె.ఉరగేశ్వర నాయుడు, ఇరువారంపల్లె వారిచే ధార్మికోపాన్యాసము, 12 గంటల నుండి 2 గంటల వరకు ఎన్.సుమతి బాగవతారిణిచే మహాభారతం హరికథ, మధ్యాహ్నం 2 గంటల నుండి 3 గంటల వరకు సి.చంద్రయ్య, చిత్తూరు, 3 గంటల నుండి 4 గంటల వరకు కె.పుష్ప, తిరుపతి, 4 నుండి సాయంత్రం 5గంటల వరకు మాయవరం సిస్టర్స్ తిరుపతి, 5 గంటల నుండిఇ 6 గంటల వరకు సాయి వేద కల్చరల్‌సొసైటి, తిరుపతి వారిచే భక్తిగీతాలు,6 గంటల నుండి 7 గంటల వరకు చందుల యశస్వీ, వరంగల్ వారిచే కూచిపూడి నృత్యం, 7గంటల నుండి 8 గంటల వరకు జతీష్ నృత్యాలయ తిరుపతి, 9 గంటల నుండి 10 గంటల వరకు వి.జస్వంత్ అడపగుండ్లపల్లె, 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రావణి సంధ్య పాపానాయుడుపేట వారిచే భరతనాట్యం,11 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు శివశక్తి నాట్యమండలి, గుంటూరు వారిచే పౌరాణికనాటక ప్రదర్శన, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలుబృందాలచే కోలాటాలు,చెక్కభజనలు, లంబాడి నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

## గణనాధునికి సాంస్కృతిక నీరాజనం -హోరెత్తించిన సాంస్కృతిక కార్యక్రమాలు





కాణిపాకం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం జరిగిన రథోత్సవం సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. భక్తులను ఎంతో ఆకట్టుకోగా, ప్రదర్శనలతో కాణిపాకం హోరెత్తింది.

## కన్నుల పండవుగా....శ్రీకళ్యాణ వెంకన్న రథోత్సవం



తిరుపతిరూరల్, సెప్టెంబర్25 ప్రభాతవార్త: తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం కళ్యాణ వెంకన్న రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగంగా కల్పించారు. స్వామిని ప్రాత:కాల సమయంలో సుప్రభాతంతో మేల్కొలిపి దైనందిన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను అలంకార మండపానికి వేంచేపు చేసి రథంపై కొలువు దీర్చారు. బ్రహ్మరథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి భక్తులకు అభయం ఇచ్చారు. భక్తుల గోవింద నామస్మరణలతో శ్రీవారి బ్రహ్మరథం ముందుకు కదిలింది. గ్రామ పురవీధుల్లో రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. భక్తులు, ఉప్పు, మిరియాలు రథంపై చల్లి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు, తుడ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి బ్రహ్మరథానికి ప్రత్యేక పూజలు చేసారు. స్వామి బ్రహ్మరథానికి ముందు భజన బృందాలు, కోలాటాలు, పిల్లన గ్రోవి కళాకారులు, వేద పండితుల మంత్రాలు ఎంతో అలరించాయి.

**అశ్వవాహనంపై శ్రీహరి విహారం:**

శ్రీకళ్యాణ వేంకన్న సోమవారం రాత్రి అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. దుష్ట శిక్షణ, శిష్టరక్షణకై అవతరించిన కల్కి అవతారంలో అశ్వ వాహనంపై అధిరోహించిన స్వామి, అభయ హస్తంతో భక్తులను కటాక్షించారు.

**నేడు చక్రస్నానం వేడుక:**

తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఆఖరు ఘట్టమైన చక్రస్నానం మంగళవారం నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 7:30 గంటల నుండి 9:10 గంటల మధ్య పుష్కరిణిలో చక్రస్నానం పూర్తి చేయనున్నారు. అలాగే సాయంత్రం 6గంటలకు నిర్వహించే ధ్వజారోహణంతో స్వామి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.

## పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు తెలియజేయగలరు

### -తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి



తిరుపతిరూరల్, సెప్టెంబర్25 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని తిరుపతిరూరల్ మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలను తెలియజేయాలని తిరుపతిరూరల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతిరూరల్, అర్బన్ తహశీల్దార్స్‌ను కలిసి, సమాచార హక్కు చట్టం పూర్తిస్థాయిలో వివరాలు తెలియజేయాలని కోరారు. తిరుపతిరూరల్ మండలంలో 2019 సంవత్సరం జనవరి31 నందు పోలింగ్ కేంద్రాలు (పి.ఎస్.నెం-163 నుండి పిఎస్ నెం-273వరకు) వారీగా ఓటర్ల సంఖ్య,1-02-2023వ సంవత్సరం నుండి 19-9-23 వరకు మాసాలు వారీగా వచ్చిన ఫారం 6,7 వివరములు, పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కత్తి సుధాకర్, గోఫి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పేరూరులో చెవిరెడ్డి బల్ల కుర్చీలు ధ్వంసం

తిరుపతిరూరల్, సెప్టెంబర్25 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ పేరూరు గ్రామ పంచాయతీలో తుడ నిధులతో ఏర్పాటు చేయించిన ఎనిమిది బల్ల కుర్చీలను ధ్వంసం చేసారు. పేరూరులో పిల్లల ఆట స్థలం, వివిధ సమావేశాలకు వేదికగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన బల్ల కుర్చీలను దారుణం విరిచేసారు. సభలు, సమావేశాలు నిర్వహించుకునే సమయంలో ప్రజలు కూర్చునేందుకు వీలుగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడ నిధులను వెచ్చించి, ఏర్పాటు చేయించిన బల్ల కుర్చీలను, గిట్టని వ్యక్తులకు ఆదివారం రాత్రి ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

**CLASSIFIEDS**

• I, **PULLABAIGARI BHARATHI** (Old Name), Flat No.G5 Green Park Apartments, STV Nagar, Tirupati, A.P. I have Changed my name to **PULLABAI BHARATHI** D/o Akepati Narayana Reddy (New Name).

• I, **SHAIK NASURUNNISA** (Old Name), H.No.5/278-3, Ravindra Nagar, Kadapa Dist.A.P. I have changed my name to (New Name) **SHAIK NASREEN** W/o Mohammed Ra feeq, My Husband PPNO: 59510 612.